క్లుప్తంగా

పూర్తి స్థాయిలో నష్ట పరిహారం చెల్లించాలి



అధికారులకు తన గోడు వినిపిస్తున్న బాధితుడు

రాజానగరం: ఏడీబీ రోడ్డు విస్తరణ కోసం రాజానగరంలో తీసుకున్న భూములకు పూర్తి స్థాయిలో నష్ట పరిహారం చెల్లించాలని గ్రామానికి చెందిన పోతుల కృష్ణ ప్రసాద్, వెంకటలక్ష్మి అధికారులకు విజ్ఞప్తి చేశారు. తీసుకున్న భూములు, భవనాలకు గజాల వారీగా పరిహారం కట్టకుండా ఎకరాల లెక్కన కట్టి, పూర్తి స్థాయిలో పరిహారం చెల్లించలేదన్నారు. గత ఆరు సంవత్సరాలుగా వేడుకుంటున్నా, తమ మొర వినేవారు లేరన్నారు. కోర్టుకు వెళితే అందుకు అవసరమైన ఫైళ్లను సంబంధిత శాఖ కోర్టుకు సబ్మిట్ చేయలేదన్నారు. తక్షణమే సంబంధిత ఫైళ్లను కోర్టుకు అందజేసి, తమకు రావలసిన పరిహారాన్ని పూర్తి స్థాయిలో చెల్లించాలని అధికారులను కోరుతున్నారు.

'మాజీ ప్రభుత్వాధికారుల అరెస్టులు అమానవీయం'

అనపర్తి : లేనిది ఉన్నట్టు, జరగనిది జరిగినట్టు భ్రమింపజేసి వైఎస్సార్ సీపీకి అవినీతి మరక అంటించడానికి కూటమి ప్రభుత్వం చేస్తున్న దుష్ప్రచారానికి బలం చేకూర్చడానికే మాజీ ప్రభుత్వాధికారుల అరెస్టులు చేశారని అనపర్తి మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ సబ్బెళ్ల కృష్ణారెడ్డి అన్నారు. శనివారం ఆయన రామవరంలో మాట్లాడుతూ మాజీ ఐఏఎస్ కె.ధనుంజయ రెడ్డి, ప్రభుత్వాధికారి కృష్ణమోహన్‌రెడ్డిలను అరెస్టు చేయడం దారుణమన్నారు. అసలు జరగని లిక్కర్‌స్కామ్ జరిగిందని ఆరోపిస్తూ ఏ ఆధారాలు లేకపోయినా తప్పుడు కేసులు పెడుతూ తప్పుడు సాక్ష్యాలు సృష్టిస్తూ కూటమి ప్రభుత్వం లేని లిక్కర్ స్కామ్‌ను దర్యాప్తు చేస్తుందని ఆయన ఎద్దేవా చేశారు. మాజీ ఐఏఎస్ ధనుంజయరెడ్డి, ప్రభుత్వాధికారి కృష్ణమోహన్‌రెడ్డి అరెస్టులను వైఎస్సార్ సీపీ తరఫున ఆయన ఖండించారు.

కంపోస్ట్ పిట్‌లు ఏర్పాటు చేస్తాం

సీతానగరం: పొలాల్లో రైతుల కోసం కంపోస్ట్ పిట్‌లు ఏర్పాటు చేస్తామని ఎన్ఆర్ఈజీఎస్ ఏపీవో బీవీ సత్యవతి తెలిపారు. ఆమె శనివారం విలేకరులతో మాట్లాడుతూ డ్వామా పీడీ ఆదేశాల మేరకు పొలాల్లో ఐదు అడుగుల పొడవు, ఐదు అడుగుల వెడల్పు, మూడు అడుగుల లోతుతో కంపోస్టు పిట్‌లను ఉపాధిహామీ పథకం ద్వారా కూలీలతో ఉచితంగా తీయిస్తామన్నారు. నివాసాల వద్ద మూడు అడుగుల కుంటల మాదిరిగా కంపోస్ట్ పిట్‌లను అవసరమైన వారికి ఉచితంగా తీయిస్తామన్నారు. పంట పొలాల్లో రూ.800, నివాసాల వద్ద రూ.300 ప్రభుత్వం వెచ్చిందన్నారు. అవసరమైన వారు ఆయా గ్రామాల్లోని ఎన్ఆర్ఈజీఎస్ ఫీల్డ్ అసిస్టెంట్లకు తెలియజేయాలన్నారు. ఈ కంపోస్ట్ పిట్‌లలో పశువుల పేడ, చెత్తా చెదారం, వ్యర్థాలన వేయడం వల్ల ఎరువు తయారవుతుందని, దాని పొలాల్లో, ఇళ్లలో చెట్లకు వాడుకోవచ్చన్నారు.

అభివృద్ధి పనుల్లో పారదర్శకంగా వ్యవహరించాలి



రంగంపేటలో రోడ్డును తనిఖీ చేస్తున్న క్వాలిటీ కంట్రోల్ అండ్ విజిలెన్స్ డీఈ సురేష్‌కుమార్

రంగంపేట: గ్రామాల్లో జరుగుతున్న అభివృద్ధి పనుల్లో పారదర్శకత పాటించాలని రాజమహేంద్రవరం క్వాలిటీ కంట్రోల్ అండ్ విజిలెన్స్ డీఈ పి.సురేష్‌కుమార్ అన్నారు. మండలంలోని రంగంపేట, సుభద్రంపేట, ముకుందవరం గ్రామాల్లో శనివారం ఆయన రోడ్ల నిర్మాణ పనులను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రోడ్ల నిర్మాణ పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటించాలన్నారు. కార్యక్రమంలో క్వాలిటీ కంట్రోల్ అండ్ విజిలెన్స్ శాఖ ఏఈ ఎండీ అహ్మద్, బిక్కవోలు పంచాయతీరాజ్ శాఖ డీఈ కె.అచ్యుతరామారెడ్డి, మండల ఇంజినీరింగ్ అధికారి కె.శ్రీనువాసు తదితరులు పాల్గొన్నారు.

కుట్టుశిక్షణ ప్రారంభం

రాజానగరం/సీతానగరం/కోరుకొండ: మహిళలు కుట్టుశిక్షణ ద్వారా ఆర్థిక అభ్యున్నతి సాధించాలని ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ అన్నారు. రాజానగరం స్కిల్ హబ్, సీతానగరం ,కోరుకొండ మండల పరిషత్ కార్యాలయాల్లో బీసీ కార్పొరేషన్ ఆధ్వర్యంలో నిర్వహించే కుట్టు శిక్షణను శనివారం ఆయన ప్రారంభించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ శిక్షణ అనంతరం సర్టిఫికెట్లతో పాటు ప్రతి ఒక్కరికీ కుట్టు మెషీన్ అందిస్తామన్నారు. ఎమ్మెల్యే సతీమణి వెంకటలక్ష్మి ఒక్కొక్కరికీ రూ. 1500 ఆర్థిక సాయాన్ని అందజేస్తామని ప్రకటించారు. రాజానగరంలో ఎంపీడీఓ జేపీ ఝాన్సీ, తహసీల్దార్ జీఏఎల్ఎస్ దేవి, సీతానగరంలో ఎంపీడీవో భారతి, ఎంపీపీ గుర్రాల జోత్స్న, తహసీల్దార్ ఎ.శ్రీనివాస్, డిప్యూటీ ఎంపీడీవో కేవీఎస్ఎస్ మూర్తి, ఏవో సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

ముంపునీరు దిగేదెలా..

- శిథిలమైన కల్వర్టు
- దానిపై గ్రావెల్ రోడ్డు ఏర్పాటు
- మట్టితో పూడుకుపోయిన తూరలు
- ముందుకు ప్రవహించని నీరు

సీతానగరం: సాధారణంగా వివిధ ప్రాంతాల్లో రోడ్లపై కల్వర్టులు మనకు కనిపిస్తూ ఉంటాయి. ఆయా ప్రాంతాల్లో ముంపు నీటిని బయటకు పంపడానికి వీటిలో తూరలు ఏర్పాటు చేస్తారు. వాటి నుంచి నీరు ఎప్పటికప్పుడు బయటకు వెళ్లిపోవడం వల్ల ఎలాంటి ఇబ్బంది కలగదు. అయితే సీతానగరం మండలంలోని ఓ ప్రాంతంలో కల్వర్టు తూరలు పగిలిపోయాయి. వాటిని తీసేసి కొత్తవి వేస్తే సమస్య పరిష్కారమవుతుంది. కానీ ఆ కల్వర్టుపై గ్రావెల్ రోడ్డు వేసేశారు. దీంతో తూరలు మొత్తం పూడుకుపోయి నీరు ముందుకు వెళ్లడం లేదు.

వివరాలు ఇవీ..

సీతానగరం మండలం చినకొండేపూడి – చీపురుపల్లి రోడ్డులోని నాలుగో కిలోమీటరు రాయి వద్ద గల అప్పన చావిడి సమీపంలోని కల్వర్టులో ఆరు తూరలు పగిలిపోయాయి. దీంతో ఆ కల్వర్టుపై గ్రావెల్ వేసి వాహన రాకపోకలు జరుపుతున్నారు. దీని కారణంగా తూరలు మూసుకుపోయాయి. వర్షాకాలం రానున్న నేపథ్యంలో తూరలను సరిచేయకపోతే సుమారు 800 ఎకరాలు ముంపులోకి చేరుకుంటాయి. అయితే క్వారీ లారీల రాకపోకలకు అనువుగా ఈ రోడ్డును ఏర్పాటు చేసినట్టు తెలుస్తోంది. వర్షాలు కురిసినప్పుడు పురుషోత్తపట్నం, రామచంద్రపురం, వంగలపూడి, సింగవరం గ్రామాల నుంచి వచ్చే నీరు ఈ తూరల నుంచే దిగువకు ప్రవహిస్తుంది.



చినకొండేపూడి - చీపురుపల్లి రోడ్డులోని కల్వర్టుపై వేసిన గ్రావెల్ రోడ్డు



తూరలు పూడుకుపోవడంతో నిలిచిన నీరు



మట్టితో నిండిపోయిన తూర లోపలి భాగం

జక్కంపూడి రాజా హయాంలో..

వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో అప్పటి ఎమ్మెల్యే జక్కంపూడి రాజా కృషితో చినకొండేపూడి – చీపురుపల్లి మీదుగా నాగంపల్లి వరకు రోడ్డు అభివృద్ధికి రూ.21 కోట్లు మంజూరయ్యాయి. సింగిల్ రోడ్డుగా ఉన్న రోడ్డును డబుల్ రోడ్డుగా విస్తరించే పనులు చేపట్టారు. దానిలో భాగంగా కల్వర్టు వద్ద చిన్న వంతెన కట్టాల్సి ఉంది. అయితే రోడ్డుపై వెట్ మిక్స్‌ను వేసి తారు వేయాల్సిన సమయంలో ఎన్నికల కోడ్ అమల్లోకి రావడంతో పనులు నిలిచిపోయాయి. వాహనాలు రాకపోకలతో లోకల్వర్టు తూరలు పగిలిపోవడంతో ఈ దుస్థితి ఏర్పడింది. ఖరీఫ్ సీజన్‌లో అధిక వర్షాలు పడితే మూసుకుపోయిన తూరల నుంచి నీరు వెళ్లే పరిస్థితి లేదు. దానివల్ల సుమారు 800 ఎకరాలు ముంపులోకి వెళతాయి. దీంతో ఖరీఫ్ సీజన్ రాకుండానే వంతెన పనులు చేపట్టాలని, లేదా పగిలిన తూరల స్థానంలో కొత్తవి ఏర్పాటు చేసి, మిగులు నీరు వెళ్లేలా చర్యలు చేపట్టాలని రైతులు కోరుతున్నారు.

వర్షాలు కురిస్తే ఇబ్బందే



చినకొండేపూడి – చీపురుపల్లి రోడ్డులో అప్పన్న చావిడి వద్దగల లోకల్వర్టు తూరలు పగిలిపోయాయి. దానిపై లారీలు వెళ్లడానికి గ్రావెల్ వేశారు. దీనితో తూరలు మూసుకుపోయి, నీరు వెళ్లడం లేదు. ఈ రోడ్డుకు రూ.21 కోట్ల నిధులు మంజూరయ్యాయి. అయితే ఎన్నికల కోడ్ కారణంగా పనులు నిలిచిపోయాయి. ఇక్కడ వెంటనే వంతెన పనులు ప్రారంభించడమో, కొత్త తూరలు ఏర్పాటు చేయడమో చేయాలి. లేకపోతే వర్షాకాలంలో పొలాలు ముంపు బారిన పడతాయి.

– ముదునూరి రామకృష్ణంరాజు, వైఎస్సార్ సీపీ రైతు విభాగం నియోజకవర్గ అధ్యక్షుడు, చినకొండేపూడి

ఆరోగ్యకర గ్రామాల నిర్మాణానికి కృషి చేయాలి

పెదపూడి: ఆరోగ్యవంతమైన గ్రామాల నిర్మాణానికి గానూ చేపట్టిన స్వర్ణాంధ్ర, స్వచ్ఛాంధ్ర కార్యక్రమాన్ని అధికారులు, ప్రజా ప్రతినిధులు బాధ్యతగా నిర్వహించాలని ఎంపీడీఓ కొవ్వూరి నరేంద్రరెడ్డి అన్నారు. పెదపూడి గ్రామంలో శనివారం స్వర్ణాంధ్ర, స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా అధికారులు, ప్రజా ప్రతినిధులు ర్యాలీ నిర్వహించారు. దీనిపై ప్రజల్లో చైతన్యం పెంచాలన్నారు. క్లీన్ విలేజ్ అండ్ గ్రీన్ విలేజ్ అని నినాదాలతో ప్రజలను ఉత్తేజపరిచారు. అనంతరం మానవహారం నిర్వహించి ప్రతిజ్ఞ చేశారు. ఇటీవల పహల్గామ్‌లో ఉగ్రవాదుల దాడిలో మృతి చెందిన వారి ఆత్మకు శాంతి చేకూరాలని మౌనం పాటించారు. గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన చలివేంద్రంలో ప్రజలకు మజ్జిగ పంపిణీ చేశారు. కార్యక్రమంలో కాకినాడ డీఎల్‌పీఓ అన్నామణి, తహసీల్దార్ పీవీ.సీతాపతి రావు, మండల విద్యాశాఖాధికారి–2 సీవీవీ సత్యనారాయణ, డిప్యూటీ ఎంపీడీఓ మేడపాటి సత్యనారాయణరెడ్డి, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ గంగాధర్, పంచాయతీరాజ్ ఏఈ శ్రీనువాసు, అంగన్‌వాడీ సూపర్‌వైజర్ శ్రీపద్మ, సర్పంచ్ కలవల కృష్ణమూర్తి, సచివాలయ కార్యదర్శి జి.ఉషారాణి, వీఆర్వో నాగేంద్ర తదితరులు పాల్గొన్నారు.



పెదపూడిలో స్వర్ణాంధ్ర, స్వచ్ఛాంధ్ర ర్యాలీ నిర్వహిస్తున్న అధికారులు

స్వర్ణాంధ్ర–స్వచ్ఛాంధ్రలను విజయవంతం చేయాలి

రంగంపేట: ప్రతి నెల మూడో శనివారం నిర్వహించే స్వర్ణాంధ్ర, స్వచ్ఛాంధ్ర కార్యక్రమాలను విజయవంతంగా నిర్వహించాలని తహసీల్దార్ కె.అనసూయ అన్నారు. రంగంపేటలో స్వర్ణాంధ్ర– స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా అధికారులు, ప్రజా ప్రతినిధులు ర్యాలీ నిర్వహించారు. అనంతర మానవహారంగా ఏర్పడి ప్రతిజ్ఞ చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ వేణు మాట్లాడుతూ ప్రజలు వడదెబ్బకు గురికాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు. ఓఆర్ఎస్ ప్యాకెట్లు, మజ్జిగ పంపిణీ చేశామన్నారు. కార్యక్రమంలో సచివాలయ కార్యదర్శి వెలిసేటి శ్రీరామ్మూర్తి, ఉప సర్పంచ్ బాలిరెడ్డి దుర్గారావు, గుప్తా తదితరులు పాల్గొన్నారు.



సీతానగరం పీహెచ్‌సీ ఆవరణను శుభ్రం చేస్తున్న సిబ్బంది



ప్రజలకు ఓఆర్ఎస్ ప్యాకెట్లు పంపిణీ చేస్తున్న అధికారులు

ఆసుపత్రి ఆవరణ పరిశుభ్రం

సీతానగరం: మండల కేంద్రమైన సీతానగరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో శనివారం స్వర్ణాంధ్ర - స్వచ్ఛాంధ్ర కార్యక్రమం నిర్వహించారు. వైద్యులు ఏవీకే చైతన్య, సునీల్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో సిబ్బంది పాల్గొని ఆసుపత్రి ఆవరణ, పరిసరాలను శుభ్రం చేశారు. పర్యావరణ పరిరక్షణలో భాగస్వాములమవుతామని ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో ఎంపీహెచ్ఈవో వైఎస్ రాయుడు, సూపర్ వైజర్ కె.సుధాకర్, ఏఎన్ఎంలు మున్నీషా, సలీమా, శిల్ప, ఆశా వర్కర్లు దేవి, జ్యోతి, కుమారి పాల్గొన్నారు.

మంచి అలవాట్లతో రక్తపోటు నియంత్రణ

రాజమహేంద్రవరం రూరల్: ఆరోగ్యకరమైన అలవాట్లతో రక్తపోటును నియంత్రించవచ్చని జిల్లా వైద్య.ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ కె.వెంకటేశ్వరరావు అన్నారు. ప్రపంచ రక్తపోటు దినోత్సవం సందర్భంగా శనివారం బొమ్మూరులోని డీఎంఅండ్‌హెచ్‌వో కార్యాలయంలో ఏర్పాటు చేసిన ర్యాలీని ఆయన ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ మారుతున్న జీవన శైలితో యుక్త వయసులోనే చాలామంది అధిక రక్తపోటు బారిన పడుతున్నారన్నారు. ప్రజలు తీసుకునే ఆహారంలో కొన్ని మార్పులు చేసుకుని, జీవన విధానాన్ని ఆరోగ్యకరంగా ఉంచుకోవాలన్నారు. దీని బారిన పడిన వారు పీహెచ్‌సీలలోని వైద్యులను సంప్రదించి మందులు వాడాలన్నారు. ఈ సందర్భంగా సిబ్బంది ప్లకార్డులతో నినాదాలు చేశారు. ప్రోగ్రామ్ ఆఫీసర్ డాక్టర్ హరిశ్చంద్ర ప్రసాద్ మాట్లాడుతూ ప్రజలతో సమావేశాలు, చిన్న చిన్న స్కిట్లు ప్రదర్శించి గ్రామాల్లో నెల రోజుల పాటు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు.



కార్యక్రమంలో మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో

ఆర్టీసీ బస్సు ఢీకొని రెండు గేదెల మృతి

కోరుకొండ: రాజమహేంద్రవరం నుంచి భద్రాచలం వెళుతున్న ఆర్టీసీ బస్సు ఢీకొని రెండు గేదెలు మృతి చెందగా, మరొకటి తీవ్రంగా గాయపడింది. గేదెల యజమాని కాలు విరిగి గాయపడ్డాడు. బూరుగుపూడిలో శనివారం ఈ ప్రమాదం జరిగింది. గ్రామానికి చెందిన అడపా పెద వీరన్న తన మూడు చూడి గేదెలను మేత కోసం పొలానికి తీసుకువెళుతున్నాడు. ఆ సమయంలో భద్రాచలం వెళుతున్న బస్సు ఢీకొంది. దీంతో ఘటనా స్థలంలోనే రెండు గేదెలు మరణించాయి. మూడో గేదె పరిస్థితి కొంచెం విషమంగానే మారింది.పెద వీరన్న కాలు విరగడంతో అంబులెన్స్‌లో రాజమహేంద్రవరం జీహెచ్‌సీకి తరలించారు.

నాణ్యత ప్రమాణాలు పాటించకుంటే చర్యలు

రాజమహేంద్రవరం సిటీ: పెట్రోలు బంకుల్లో నాణ్యత ప్రమాణాలు పాటించకుంటే చర్యలు తీసుకుంటామని లీగల్ మెట్రాలజీ ఇన్‌స్పెక్టర్ శివబాలాజీ హెచ్చరించారు. ప్రపంచ లీగల్ మెట్రాలజీ వారోత్సవాల్లో భాగంగా శనివారం రాజమహేంద్రవరం సెంట్రల్ జైలు పెట్రోల్ బంక్ వద్ద వినియోగదారులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. జిల్లా వినియోగదారుల రక్షణ మండలి సభ్యుడు గొట్టిముక్కల అనంతరావు మాట్లాడుతూ ప్రతి వినియోగదారుడు పెట్రోలు నాణ్యత, పరిమాణం సరిచూసుకోవాలని సూచించారు.

సెలవుల్లో చూసేద్దాం..

- ప్రత్యేక ఆకర్షణగా కాటన్ మ్యూజియం
- తరలివస్తున్న విద్యార్థులు
- వేసవి సెలవుల నేపథ్యంలో రద్దీ

ధవళేశ్వరం: వేసవి సెలవులను విద్యార్థులు బాగా ఎంజాయ్ చేస్తున్నారు. ఇప్పటి వరకూ చదువులతో కుస్తీ పట్టిన వారందరూ ప్రస్తుతం ఆటపాటలతో ఉత్సాహంగా గడుపుతున్నారు. ఏడాదంతా పుస్తకాల్లోని పాఠాలు, మార్కులు, ర్యాంకులతో గడిపే వారికి.. బయట ప్రపంచాన్ని చూపించడానికి ఇదే మంచి సమయం. ఆహ్లాదంతో పాటు విజ్ఞానాన్ని అందించేందుకు తల్లిదండ్రులు చర్యలు తీసుకోవాలి. దానికి కాటన్ మ్యూజియాన్ని సందర్శించడం మంచి నిర్ణయం. ఈ విధంగానే ఆలోచించిన పలువురు తల్లిదండ్రులు తమ పిల్లలను ఇక్కడకు తీసుకువస్తున్నారు.

పలువురి ఆసక్తి

దూర ప్రాంతాల నుంచి వచ్చే బంధువులు, పిల్లలతో కలిసి కాటన్ మ్యూజియాన్ని సందర్శించేందుకు పలువురు ఆసక్తి చూపుతున్నారు. రాజమహేంద్రవరం పరిసర ప్రాంతాల ప్రజలు, చిన్నారులతో గత 20 రోజులుగా కాటన్ మ్యూజియం కిటకిటలాడుతోంది. విజ్ఞానంతో పాటు ఆహ్లాదాన్ని పంచుతోంది. గోదావరి సోయగాల నడుమ నిర్మించిన ఈ మ్యూజియం సందర్శకులను విశేషంగా ఆకట్టుకుంటోంది. కాటన్ మహాశయుని జీవిత విశేషాలతో పాటు గోదావరి పుట్టుక నుంచి సముద్రంలోకి ప్రవేశించే వరకూ సమగ్ర వివరాలు ఇక్కడ పొందుపర్చారు.

విజ్ఞానంతో పాటు వినోదం

కాటన్ మ్యూజియం విజ్ఞానర వరప్రదాయినిగా విరాజిల్లుతోంది. దీన్ని సందర్శించిన వారికి గోదావరి ప్రవహించిన తీరుపై సమగ్రంగా అవగాహన కలుగుతోంది. అలాగే బ్యారేజీ నిర్మించినప్పటి పరిస్థితులను అక్కడి చిత్రాల్లో చూడవచ్చు. మ్యూజియం ఆవరణలో గోదావరి పుట్టిన నాసిక్ నుంచి సముద్రంలో కలిసి పోయే వరకు నమూనాను ఏర్పాటు చేశారు. దాని ఉప నదులు ఎక్కడ కలుస్తాయి. నది పక్కనే ఉన్న దేవాలయాలతో ఈ నమూనాను ఏర్పాటు చేశారు. డెల్టా నమూనాలతో పాటు కాటన్ జీవిత చరిత్రను సమగ్రంగా అందుబాటులో ఉంచారు.

365 రోజులూ తెరిచే ఉంటుంది


కాటన్ మ్యూజియం 365 రోజులు తెరిచే ఉంటుంది. ప్రతి రోజు ఉదయం 9 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకూ, మధ్యాహ్నం 3 నుంచి సాయంత్రం 6.30 గంటల వరకూ సందర్శించవచ్చు. మ్యూజియం లోపల ఫొటోలు తీసుకునేందుకు అధికారుల అనుమతి తీసుకోవాలి.



కాటన్ మ్యూజియం



గోదావరి నది ప్రవాహ నమూనా



ఆనకట్ట నిర్మాణ పనులకు వినియోగించిన ఆవిరి యంత్రం

కళ్ల ముందే చరిత్ర

కాటన్ ఆనకట్ట నిర్మాణానికి ముందు ఈ ప్రాంత ప్రజలు ఎదుర్కొన్న ఇబ్బందులను కళ్లకు కట్టినట్లు ఉండేలా ఫొటో గ్యాలరీ ఏర్పాటు చేశారు. 1986 వరదలలో ఈ ప్రాంత పరిస్థితిని వివరించే ఫొటోలను సైతం ఉంచారు. మరో వైపు ఆనకట్ట నిర్మాణ సమయంలో ఉపయోగించిన పరికరాలను ఉంచారు. వాటి పేర్లను వాటిని అప్పట్లో దేని కోసం వినియోగించారో ఆ వివరాలను అక్కడ పొందుపరిచారు. అదే విధంగా కాటన్ బ్యారేజీ పక్కనే ఏర్పాటు చేసిన ఈ మ్యూజియంలోని పార్కు ఆహ్లాదాన్ని సైతం పంచుతోంది. ఆ పచ్చని గార్డెన్ చిన్నారులను, సందర్శకుల విశేషంగా ఆకట్టుకుంటుంది.

రక్తపోటు నియంత్రణపై సదస్సు



సదస్సులో మాట్లాడుతున్న కుమారస్వామి

రాజానగరం: ప్రపంచ రక్తపోటు దినోత్సవాన్ని పురస్కరించుకుని శనివారం గైట్ స్కూల్ ఆఫ్ ఫార్మసీలో అవగాహన సదస్సు నిర్వహించారు. ఏలూరులోని సీఆర్ రెడ్డి కాలేజీకి చెందిన అసిస్టెంట్ అధ్యాపకుడు డాక్టర్ బి.కుమార స్వామి రిసోర్స్‌పర్సన్‌గా వ్యవహరించారు. రక్త పోటు గుర్తింపు, నివారణ, నియంత్రణ తదితర చర్యలను వివరించారు. మానసిక ఒత్తిడిని తగ్గించుకోవడం, మద్యం , ధూమపానానికి దూరంగా ఉండటం, ఆరోగ్యకరమైన ఆహారం తీసుకోవడం, రోజుకు 8 గంటలు నిద్ర, క్రమం తప్పకుండా వ్యాయామం చేయడం ద్వారా రక్తపోటును అదుపులో ఉంచవచ్చన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ ఎండీ ధనరాజ్, ఎన్ఎస్ఎస్ పీఓ షేక్ మీరా పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

రాజమహేంద్రవరం రూరల్: రాజమహేంద్రవరం ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతున్న దివాన్ చెరువు నరస చెరువు ప్రాంతానికి చెందిన ఆకుల గోవిందరావు (50) శుక్రవారం అర్ధరాత్రి మృతి చెందాడు. వివరాల్లోకి వెళితే.. ఆకుల గోవిందరావు తన భార్యతో గొడవపడ్డాడు. ఈ నేపథ్యంలో శుక్రవారం ఉదయం సమయంలో గడ్డిమందు తాగి ఆత్మహత్యకు యత్నించాడు. అతడిని చికిత్స కోసం రాజమహేంద్రవరం ప్రభుత్వాసుపత్రికి తరలించగా, చికిత్స పొందుతూ మృతి చెందాడు. అతడి కుమారుడు ఆకుల రమణ ఫిర్యాదు మేరకు బొమ్మూరు ఎస్సై మురళీ మోహన్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

23 సినిమాకు ప్రేక్షకుల ఆదరణ



విలేకరులతో మాట్లాడుతున్న డైరెక్టర్ రాజ్ రాచకొండ, చిత్రంలో హీరో హీరోయిన్లు తేజ, తన్మయ

ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): మూడు కీలక ఘటనలను ప్రస్తావిస్తూ, ఆ కేసులు ఎలా ముగిసాయనే అనే అంశాన్ని హైలెట్ చేస్తూ తీసిన 23 (ఇరవై మూడు) సినిమాను ఆదరిస్తున్న ప్రేక్షకులకు ధన్యవాదాలు తెలియజేస్తున్నామని దర్శకుడు రాజ్ రాచకొండ చెప్పారు. స్పిరిట్ మీడియా నిర్మాణంలో తేజ రావిపాటి, తన్మయ, ఝాన్సీ కీలక పాత్రలలో నటించిన ఆ చిత్రం నగరంలోని రంభ థియేటర్‌లో ప్రదర్శితమవుతోంది. ఈ నేపథ్యంలో శనివారం ఉదయం ఆట సమయంలో చిత్ర యూనిట్ విచ్చేసి, ప్రేక్షకులను పలకరించింది. ముందుగా డప్పు వాయిద్యాల నడుమ సురేష్ మూవీస్ ఎంటర్‌టైన్‌మెంట్ ఎల్ఎల్‌పీ స్వాగతం పలికారు. చిత్ర యూనిట్‌ను మాజీ కార్పొరేటర్ పరిమి వాసు పూలమాలలతో సత్కరించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో డైరెక్టర్ రాజ్ రాచకొండ మాట్లాడుతూ గతంలో తాను డైరెక్ట్ చేసిన మల్లేశం , 8 ఏఎం మెట్రో చిత్రాలకు మంచి ఆదరణ లభించిందన్నారు. 1991లో గుంటూరు జిల్లా చుండూరు మారణకాండ ఘటన, 1993లో చిలకలూరిపేటలో బస్సు దహనం, 1997లో హైదరాబాద్ జూబ్లీహిల్స్‌లో కారు బాంబు ఘటనల నేపథ్యంలో 23 చిత్రాన్ని రూపొందించామన్నారు. హీరో తేజ రావిపాటి, హీరోయిన్ తన్మయి మాట్లాడారు.

ఇంకుడు గుంతలతో భూగర్భ జలాల వృద్ధి

రాజమహేంద్రవరం సిటీ: ఇంకుడుగుంతలతో వర్షపు నీటిని సంరక్షిస్తే భూగర్భ జలాలు పెరుగుతాయని కమిషనర్ కేతన్ గార్గ్ తెలిపారు. నగర పాలక సంస్థ కార్యాలయంలో ఏర్పాటు చేస్తున్న ఇంకుడు గుంతలను శనివారం అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ మారుతున్న వాతావరణ పరిస్థితుల దృష్ట్యా నీటి ప్రాధాన్యతను ప్రతి ఒక్కరూ గుర్తించాలన్నారు. ఆహార భద్రతకు భరోసా కల్పించడంలో భూగర్భ జలాలదే కీలకపాత్ర అన్నారు. రాజమహేంద్రవరం నగరంతో పాటు చుట్టూ ఉన్న మరో పది పంచాయతీల్లో 6,560 ఇంకుడు గుంతలను ఇప్పటికే నిర్మించుకున్నట్లు చెప్పారు. ప్రతి ఒక్కరూ వాన నీటి సంరక్షణలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మేనేజర్ ఎండీ అబ్దుల్ మాలిక్, సూపరింటెండింగ్ ఇంజినీర్ ఎస్‌ఈహెచ్ కోటేశ్వరరావు, ఈఈ మాధవి, ఇతర అధికారులు పాల్గొన్నారు.

ప్రతిష్ఠాత్మకంగా రివర్ ఫ్రంట్ ప్రాజెక్ట్

రివర్ ఫ్రంట్ ప్రాజెక్టును ప్రతిష్ఠాత్మకంగా తీసుకుని, అభివృద్ధి పనులు చేస్తున్నట్టు కమిషనర్ కేతన్ గార్గ్ తెలిపారు. దీనిలో భాగంగా గోదావరి ఘాట్ వద్ద జరుగుతున్న పనులను ఇంజినీరింగ్ అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ ప్రాజెక్టులో భాగంగా పీవీ నరసింహారావు పార్కు, గౌతమీ సందనం పార్కు మధ్య ఓ కనెక్టింగ్ బ్రిడ్జి నిర్మిస్తామని, బ్రాహ్మణులు పిండప్రదానాలు నిర్వహించే షెడ్డును మార్చాల్సి ఉందన్నారు. ప్రజలకు ఎక్కడా అసౌకర్యం కలగకుండా మార్కండేయ ఘాట్ వద్ద ఓ స్థలాన్ని పరిశీలించామన్నారు. దాన్ని తీసుకునేందుకుగానూ నీటిపారుదల శాఖకు లేఖ రాయాలని నిర్ణయించినట్లు తెలిపారు. అలాగే మార్కండేయ ఘాట్ వద్ద పిండ ప్రదానాలకు ప్రస్తుతం ఉన్న షెడ్డుకు నూతనంగా రంగులు వేసి, లైటింగ్ ఏర్పాటు చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. అనంతరం ఆవలో 100 అడుగుల రోడ్డును ఎండ్ టూ ఎండ్ తరహాలో అభివృద్ధి పరచడానికి ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. ఆయన వెంట ఈఈ మదార్ష అలీ షేక్, ఇతర అధికారులు ఉన్నారు.